గౌతమి స్వీయ చరిత్రము.

[కరుణార్ద్రమగు చిన్న కథ]

రాయసము వేంకట శివుడు గారు. ఎమ్. ఏ., ఎల్. టీ.

బాల్యావస్థ

నేనెక్కడ జనించితినో నాతలిదండ్రు లెవరో నాకుఁ దెలియదు. నా చిన్ననాఁటి దినములు జ్ఞప్తికిఁ దెచ్చుకొనునప్పుడు- ఉన్నతమైన కాయమును తెల్లని ముఖకాంతియును గల యొక కుక్కయాకారము స్ఫురించు చుండును. స్తన్యపానము చేయుచు దానివెనువెంటనే నేను దుముకుచుఁ బోవుచుండుట నాకుఁ దోఁచుచుండును. కాని యానాఁటి సంగతులు వివరముగను వరుసగను నేను చెప్పఁజాలను. పిమ్మటఁ గొంత కాలమునకుఁ దటస్థించినవి మాత్రమే నేను గుర్తెఱుఁగుదును.

ఒకానొక దినము నేను వాయువేగముతో గ్రామములో నొక క్రొత్త వీథిని బరుగెత్తి పోవుచుంటిని. ఇరుపార్శ్వముల నుండియు నపుడు కుక్కలు నన్ను ముట్టడింప సాగెను. నేను వానిని లెక్కసేయక- పిక్కబలము చూపి పోసాఁగఁగా నా దేహమంతయు గాయములతోఁ గప్పఁబడెను. శత్రువుల గోళ్లగీఱలును - పండ్లకాటులును- దిగి నాశరీరమునుండి రక్తధారలు సెలయేళ్ల వలె స్రవింపసాగెను. కాని యింతటితో శునకసమూహమునకు మత్సరము శమింపలేదు. అలసట చేతను బాధచేతను గొంతవడికి నేను నేలఁ బడితిని. కుక్కలు చుట్టును జేరి నన్నింకను బాధింపఁ జొచ్చినవి. ఒకటి చెవి పట్టిలాగును. ఇంకొకటి తోఁక పెఱుకును. వేఱొకటి కాలు కొఱుకును. ఇటు లుండఁగా గుభాలునఁ బెద్ద శునక మొకటి యెచటినుండియో వచ్చి నా గొంతును బట్టుకొనెను. అంతటితో నాకు స్మృతి తప్పిపోయెను. మరణ మాసన్న మయ్యె నని తలంచితిని.

కాని కొంతసేపటికి నాకు స్మృతి కలిగెను. మృత్యుదేవత యపరావతార మనఁదగు ఆపెద్ద శునకమువానినుండి నన్నెవ్వరు తప్పించిరో ఎంతకాలము నేను స్మృతిలేని యవస్థయం దుంటినో నాకుఁ దెలియదు. కాని యిపుడు నేనొక నిశ్శబ్దమగు చావడియం దుంటిని. నాశరీరము నందలి గాయములకు మందు దట్టముగఁ బూయబడి యుండెను. అప్పుడప్పుడు వయసువీరిన యొక మనుజుఁడు వచ్చి నాముఖమును నిమురుచు, తన కన్నులనుండి రాలు బాష్పములను తుడుచుకొనుచు నాబాధను శమింపఁజేయఁ జూచుచుండును. ఇట్లాయన వచ్చి నా కుపచారములు చేయునపుడెల్లను నేను తోఁక నాడించుచుందును నాకు దగ్గఱగఁ జాఁపబడిన యాతని హస్తమును నాకుచుందును. ఆపత్కాలమునఁ గనిపెట్టినవారే కదా నిజమైన తలిదండ్రులు! అమితబాధచే నహర్నిశము నేను గనులు మూసికొని మూలుగుచున్నను ఈయన వచ్చి నాచెంత నుండునపుడు మాత్రము నాబాధకుఁ గొంత యుపశమనము గలుగుచుండును.

మిత్రులు

ఆయింట నుండునది నా రక్షకుఁడగు నీపురుషుఁడు గాక యింక నిరువురు మాత్రమే. వారు ఒక వృద్ధస్త్రీయును. ఒక బాలికయును. నాకు గంజి పోయునపుడు మాత్రమే యవ్వ వచ్చుచుండును గాని, బాలికమాత్రము తన తండ్రి యగు నారక్షకునితో వచ్చి నన్ను పలుమాఱు సందర్శించుచుండును. మొట్టమొదట నన్ను సమీపింప నామె వెఱచుచుండినను, అంతకంతకు నే ననిన నోఁత వెఱపులు లేక, తండ్రివలెనే నాకు సాహాయ్యముఁ జేయుచుండును. జ్వర తీవ్రతవలన నా కాఁకలి నశించి యాహార మసహ్యమైన యాదురవస్థయందు నాకుఁ దిరిగి భోజనమం దిష్టము కలిగించిన మహనీయురా లీమెయే. చిఱునవ్వుతో నలంకరింపఁబడిన యీమెవదనపద్మము నాకన్నులయెదుటఁ దోఁచిన తోడనే నాబాధకుఁ దీక్ష్ణత తగ్గుచుండును. ఈమె చిన్నిచేతులు పోయు గంజి యెంతో మధురిమఁ దాల్చియుండును. నాయం దపరిమిత మగు దయ గలిగి యాబాల రొట్టెముక్కలు మిఠాయి మొదలగు సూడిదవస్తువులు దెచ్చి నాజిహ్వకుఁ దిరిగి చైతన్యము గలిగించెను. ఆబాలిక దయాపూర్వకముగ నా కిచ్చుచుండు ముద్దుపేళ్లకు లెక్కలేదు. ఆమె నాయెడలఁ జూపించిన కరుణయును ప్రేమయును నే నెన్నఁడును మఱచిపోఁ జాలను.

ఇట్టిగృహస్థుల దయయే కారణముగా నేను బునర్జీవము నొందితిని. నానాఁట నా గాయములు మానిపోయెను. శరీరమునకుఁ గ్రొత్త నెత్తురు పెట్టెను. సోయగ మిగిరించుచుండె. నే నంత గ్రామములో రాకపోకలు సేయుట కారంభించితిని. మావీథిని గల శునకము లన్నియు నా బలమును జూచి నన్ను మన్నింపసాగినవి. ఏయుపద్రవమును లేక నేను మావీథిలో నిచ్ఛావిహారము సలుపుచుందును. పగలంతయును గ్రామములోని రాచకార్యములను చక్కపెట్టి రాత్రిపూఁట నిలుసేరుచుందును. అంత నత్యాదరముతో నారక్షకు నింట నా కాహార మిడుదురు.

దినచర్య

ఆకాలపు నాఁటి నాదినచర్య నాకు జ్ఞప్తిలో నున్నది. వేకువనె నేను నిద్రనుండి లేచునప్పటికి నారక్షకుఁడు లేచి గ్రంథకాలక్షేపము చేయుచుండును. అంత నే నాయనదగ్గఱకుఁ బోఁగా ఆయన నాదేహము నిమురుచు, "ఇఁకఁ బోయిరా!" యని పలుకుదురు. వారి యనుజ్ఞగైకొని నేను వీథిలోనికిఁ బోయి గ్రామవ్యవహారములు చక్కఁబెట్టుచుందును.

వీథిసంరక్షణము శునకజాతికి విధికృతమైన కార్యము. గ్రామములోని ప్రతి వీథియును బ్రత్యేక శునకసమాజ పరిపాలనమునకు లోనయి యుండును. వీథిలోనికిఁ గ్రొత్తవా రెవరును రాఁగూడ దనున దిమాసమాజపు మొదటి నిబంధన. ఇది మాత్రము మానవులయెడఁ బూర్తిగ వర్తింపఁజేయుట మాకు సాధ్యము గాదు. కావుననే మానవు లిన్ని యనర్థముల పాలగుచున్నారు. కాని మా విధి మేము నెఱవేర్చుకొను చుందుము. క్రొత్తమనుష్యుఁడు గాని క్రొత్త వేషము ధరించినవాఁడు గాని వీథిఁ బడఁగనే, మేము మొఱుఁగుచుందుము. ఇంకొక వీథికుక్క కానఁబడఁగనే మేము మొఱుఁగుచు దానిని ముట్టడింతుము. అది పారిపోయి తప్పించుకొనినఁ గాని దాని పరువు నిలువదు. అది తోఁక ముడుఁచు కొనినచో ఇంక దానివంకఁ బోము. వీథిలోనుండి పిల్లులు మొదలగు క్షుద్రజాతిజంతువులను బాహాటముగ మేము నడువనీయము. వన్యమృగము లేవైన దూరమున నుండఁగనే మేము పసిపట్టి ఆజాడ లూరివారికిఁ దెలియునట్లుగ బొబ్బ లిడెదము. ఒక్కొకసారి రాత్రులు మాకన్నులకుఁ బగ లెన్నఁడును గానరాని వికృతాకారములు పొడసూపును. వెంటనే మేము ఆకాశమువైపునకుఁ దలయెత్తి పొలికేక లిడుచుందుము. వీథిలో నుండు కుక్కలన్నియు నొక్కపెట్టున నేడువఁగా నాయాకారములు మటుమాయ మగును! ఏదో యొక కాలమునందు తప్ప సామాన్యముగ శునకజాతివా రందఱును నిరంతరము మిత్రతతో నుందురు. ఊసు పోనపుడు మేము చెరలాటములతోను, కృత్రిమపుఁ బోరాటములతోను గాలము గడపుదుము.

ఇటువంటి బయటి పనులు చక్కపెట్టుకొని నే నిలు చేరి యజమానుని దగ్గఱకుఁ బోఁగా నపు డాయన ప్రేమము ఉట్టిపడునట్టుగ నా శరీరమును స్పృశించును. తోఁక యాడించుచు ఆయనచేతిని దాఁకుచు "కుయ్యో" యని మొఱుఁగుచు నాయనయెడల ననురాగము నగపఱచుచుందును. అంతట ఆయన స్నానమొనర్చి భోజనమునకుఁ బోవును. ఆసమయముననే యవ్వ నన్నుద్దేశించి, "గంజిమూఁకుడు తెచ్చుకొమ్మ" అని పలుకును. నే నపుడు దొడ్డిలోనున్న మూఁకుడు దెచ్చుకొందును. దానిలో నాకుఁ గావలసిన యన్నమును గంజియు వైతురు. అది భుజించి, తిరిగి మూఁకుడు యథాస్థానమునఁ జేర్చి చావడి మీఁద నేను విశ్రమింతును.

మధ్యాహ్నసమయమున నేను యజమానుని జేరరాదు. ఈనిర్బంధముయొక్క యర్థము మొట్టమొదటి దినములలో నాకుఁ దెలియక, నామీఁద యజమానునికిఁ గోపము వచ్చెనా యని తలంచుచు వచ్చితిని. కాని, అంతకంతకు, ఆయన నిష్ఠాపరుఁ డనియును, భోజనానంతరమున నను స్పృశింప నొల్లఁ డనియును నేను గుర్తెఱిఁగి, జాగరూకతతో నే నాయనకు దూరముగనే తిరుగుచుందును. అవ్వగారిని నే నెపుడును సమీపింపనే కూడదు. నా యజమానుని కొమార్తె యగు "మీనాక్షి"కిని నాకును జెప్పనలవిగాని మైత్రి. ఆమె యిల్లు విడిచి యెచటికిఁ బోయినను తిరిగి యిలుసేరువఱకును నే నామెను వెంబడించుచుందును. ఆమెచెలికత్తెలమీఁదికి నే నెన్నఁడును పోవువాఁడను గాను. కాని దుష్టులెవరైన నామెకుఁ జెడుగు చేయఁజూచినచో నిఁక వారి కర్మము మూఁడినదే. "గౌతమీ!" యనునామె పలుకు నా కెంత దూరమున వినవచ్చినను కనుఱెప్ప గీటునంతలో నేను మీనాక్షిదగ్గఱకుఁ బోయి చేరుదును. ఆహా! ఆమెముద్దుపలుకులకును ఇతరులమాటలకును ఎంత వ్యత్యాసము గలదు! నాహృదయమునకు మీనాక్షికంటెఁ బ్రియతర మగు వస్తు వేదియును గానరాదు. ఆమె నాబహిఃప్రాణమే.

యజమానుడు

శునకజాతిజంతువు నగు నాకు మానవుఁ డగు నా యజమానుని యూహాపోహాలు కష్టసుఖములు నేమి తెలియఁ గలవు? ఐనను నేను బగటిపూఁట చావడిమీఁదఁ బండుకొని యుండునపుడు సదా కనులాయన వైపునకే త్రిప్పి ఆయనముఖావలోకనము చేయుచుందును. ఆయన మితభాషి. నైష్ఠికుఁడు. గ్రంథకాలక్షేపమునందును ధ్యానమునందును గాలము గడపుచుండును. ఆయన యాలోచనల విషయములు నాకు దుర్గ్రాహ్యములైనను, అవి యుత్కృష్టమైనవని మాత్రము నా దృఢవిశ్వాసము. ఆయనయాజ్ఞలను జవదాఁటకుండుటయే నాముక్తి. ఆయనయభిమతము నెఱవేర్చుటయె నాకు మోక్షము. అట్టిమహనీయుని వాక్కులనే నిదానముగఁ జేసికొని ఆయనకనుసన్నలనే మెలఁగవలె నని నాయుద్యమము. కావున శునకజాతిచర్యలందు నాకు వాంఛ క్రమముగఁ దగ్గసాగెను. ఒక్కొకప్పుడు కొన్ని దినములవఱకును నేను తోడిశునకములను దర్శించుటకు వీథిలోని కడుగైన నిడను. నాయజమానుని ముఖమునందు నిమేష నిమేషమునకును గానవచ్చెడిమార్పులను బరికించుచుందును. అర్థము బోధపడకున్నను ఆయన చదివెడి సంగతులు వీనులార వినుచు నేను బుద్ధికుశలతఁ జాల్చి యుందును. నా కాయనయందున్న వైత్తికశ్వాసమున పరమోత్కృష్టములైన వని యాయనచర్యల నే ననుకరింతును. ఆయన నెలకు రెండుపర్యాయము లుపవసించును. నేను నటుల చేయుటకును అలవఱచుకొంటిని. ఒక్కొక్కతటి ఆయన రాత్రిపూఁట భుజింపకుండును. నేను నపుడు భుజింపనొల్లను. నాయందు జాలిగొని అట్టి సమయములందు యజమానుఁడు భుజింపుమని నన్నెంత ప్రేరించినను నే నాఁగింపను.

మీనాక్షితో నేడఁబాటు

ఇట్లు దినములు మాసములు వత్సరములును గడచిపోయెను. మీనాక్షి నాకన్నుల యెదుటనే పెరిఁగి పెద్దదయ్యెను. అంత నాయెజమానుని యింట నొక గొప్ప యుత్సవము జరిగెను. ఎందఱెందఱో యతిథులు వచ్చిరి. అందఱు క్రొత్తవారగుటచేత వారియెడల నేను ద్వేషబుద్ధి వహింప మొదట నుద్యమించినను మీనాక్షికిని నా రక్షకునికిని హాని తలంపకుండుటచే నేనూరకుంటిని. పల్లకిలో మీనాక్షిని నొకయువకుని నెక్కించి యూరేగించునపుడు నేనును చెలికత్తె సంరక్షణకై వారితో నూరేగి యింటికామెను సురక్షితగఁ గొనివచ్చుచుందును. ఇంతవఱకును ఉదంతములు శాంతతతోనే జరిగినవి. కాని ఒకానొకదినము మీనాక్షిని బల్లకిలో నెక్కించి వారందఱు గ్రామాంతరముఁ గొనిపోవ సమకట్టిరి. ఆసమయముననే నా యజమానుఁడు దేహాస్వస్థత

లేకపోవుటచే మంచముమీఁదఁ బడియుండుట తటస్థించెను. తాను పోవునపుడు బాలిక కంటఁ దడిపెట్టెను. తండ్రికిఁ గూడఁ గన్నీరు క్రమ్మెను. అట్టి సమయమున నాచెలికత్తెను వారు పల్లకిలోఁ గూర్చుండ బెట్టికొని పోసాగిరి. ఆహా! నాకిఁక దీనియర్థ మంతయు బోధపడినది. ఆద్రోహులు మొదట మిత్రులవలె వీరియింటఁ బ్రవేశించి పిమ్మట బాలికను గొనిపోవ నుద్యమించిరి! ఇది మీనాక్షికిని దండ్రికిని దుస్సహముగ నున్న దనుటకు వారిదుఃఖమే నిదర్శనము. కష్టకాలమున స్వామికార్యము మఱచిన సేవకుని ప్రయోజన మేమి? కావున నేను వేగముగఁ బల్లకి మోచుకొని పోవు బోయలకాళ్ల కడ్డము వచ్చి- వారిని దక్కిన వారిని- గఱవ మొదలిడితిని. అంత వారితో నాకుఁ బెద్ద కయ్యమయ్యెను. వారిచేతులనుండి మీనాక్షిని విడిపింపలేకపోయినను, తుదకు నేనామెను విడువకయైన నుండవలెనని నాకుఁ బట్టుదల కలిగెను. కాని యింట వ్యాధిగ్రస్తుఁ డగు యజమానుఁ డేమగునో యని మనస్సు ఉయ్యేలవలె నిటునటు నూఁగెను. యజమానునిమీఁద మనసు తిరిగినపుడు వెంటనే నేను మీనాక్షిని విడిచి యింటికిఁ బోవుదును. యజమానుఁ డింట భద్రముగ నుండుటఁ గాంచి సంతుష్టిఁ జెంది ఇఁక మీనాక్షిని గాపాడవలయు నని యచటికిఁ బరుగు లిడుదును. ఇటు లెన్నియో సారు లిటు నటు నాదినము పరుగెత్తు చుంటిని. నాసందడిలో నే నిటు లుండఁగా దూరపువీథికిఁ గ్రొత్తగ వచ్చిన పెద్దకుక్క యొకటి ఒక సందునుండి నేను మఱలుచుండఁగా న న్నాకస్మికముగఁ బట్టుకొనెను. దాని నోడించుటకు నాకు శక్తియున్నను యుద్ధముచేతఁ గాలహరణ మగుననియును ఇంతలోఁ బల్లకి మోచువా రాబాలను గొనిపోదు రనియును నేను బలాయనమైతిని. అదుష్టశునకము మాత్రము నామనసు గ్రహింపక నేను బిఱికిదాని నని భ్రమఁ జెంది, నా వెన్నుమీఁది కంప గట్టిగఁ గొఱికివైచెను. అప్పటికిని నేను స్వామికార్యమును విడువక బాధ కెట్లో సహించి పోతిని. ఇంతలో మీనాక్షిపాలకి చాల దూరము పోయెను. నాకు ఆమె కానిపింపలేదు. అంత నేను విఫలమనోరథనై యిలు సేరితిని.

మీనాక్షి గానఁబడుట

ప్రియమిత్రమగు మీనాక్షిని బాసి నే నిఁక నెట్లు జీవింపఁ గలను? ఐనను రోగపీడితుఁడగు యజమానుని పడకను దివారాత్రములు నేను గనిపెట్టుకొనియున్నాను. ఆహార మనిన నా కిపుడు వాంఛ లేదు. రేయి కంటి కొకకునుకైనఁ బట్టదు. యజమానుఁ డెంతయొత్తిచెప్పినను నే నాహారము భుజింపలేదు. శరీరము మనసు గూడఁ బెద్దకొలిమిలోఁ బడి మండుచున్నట్లు తోఁచుచున్నది. ఇటులుండ నీ ప్రాతఃకాలమున వాకిటఁ బల్లకిమ్రోఁత వినవచ్చుచున్నది! ఎవరో బాలిక యొకతె నా కన్నుల కగపడుచున్నది. ఆహా యీమె మీనాక్షియే! ఆహా ఏమి నాపుణ్యము!!

[మీనాక్షికొఱకుఁ బనవి పనవి, ఆమె క్రొత్తగ నత్తవారింటనుండి రావేగమె చూచునపు డానందపరవశయై గౌతమి యాకస్మికముగ మరణము నొందె నని యింటివారు చెప్పుచున్నారు. గౌతమి వెన్నుమీఁద నొక పెద్దపుండు ఉండుట గనిపెట్టినది మీనాక్షియే. వ్యాధిగ్రస్తుఁ డగు మీనాక్షితండ్రి యిన్నాళ్లు నిది చూడనేలేదు. కాని గతించినదాని కిపు డెవరేమి చేయఁగలరు? ఆదిన మాగృహము రోదనధ్వనులతో నిండెను. ఎట్టకేలకు మీనాక్షి తండ్రి ధైర్యము తెచ్చుకొని- గౌతమి శునకజన్మ మెత్తినను ఋజుమార్గమున నడుచుకొనుటచే నది పుణ్యపురుషునివలెనే యుత్తమలోకప్రాప్తిఁ జెందు నని నిర్ధారణచేసి - దానికి దహనసంస్కారాదిక్రియలు గావించె నని తెలియవచ్చుచున్నది—కథకుడు.]

సమరతృష్ణాగీతము

దువ్వూరి రామిరెడ్డి గారు

సంగరతృష్ణచే । స్వాంతంబు రగులఁ
బటు దురాశావేశ । పారవశ్యమున
నధికారదాసులై । యవనిఁ బీడించు
మనుజసంతతులార । కనికరము లేక
బలహీనజాతులఁ । బట్టి చంపెదరు
దేహంబు నలుపైనఁ । దెలుపు పసుపైన
నాత్మబంధులు గారె । యఖిలజనంబు?

కామంబు క్రోధంబు । గర్వంబు జాతి
దేశంబు భాష య । న్దరలు చింపంగ
సర్వసామాన్యమై చను । మానవత్వ
మొక్కటీరునఁ గాక । యున్న వేర్వేఱ?
మానవరక్త సం । భార విక్రయము
గావించు నక్రైస్తు । ఘాతుకులార
విజయమదిరాపాన । వీతచిత్తమున